సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



పోస్టర్ యుద్ధం

టీడీపీలో పోస్టర్ యుద్ధం నడుస్తోంది. సొంత పార్టీ నేతపైనే ఈ పోరు సాగుతోంది.

- 8లో



అశ్రు నివాళి

తహసీల్దార్ రమణయ్యకు జనం అశ్రు నివాళులర్పించారు. స్వగ్రామం దిమిలాడలో అంత్యక్రియలు జరిగాయి.

- 8లో



కలెక్టర్‌ను కలిసిన పీఓ

సీతంపేట: కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి కలెక్టరేట్‌లో శనివారం కలిశారు. ఐటీడీఏ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, గిరిజన సంక్షేమంపై వివరించారు.

న్యూస్‌రీల్

అడిషనల్ డీఎంహెచ్‌ఓగా ప్రసాదరావు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ అడిషనల్ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ మజ్జి ప్రసాదరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈయన జిల్లా లెప్రసీ నియంత్రణ, టీబీ నియంత్రణాధికారిగా కూడా బాధ్యతలు చేపట్టనున్నారు. శనివారం బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతవరకు అదనపు డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ అనూరాధ స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే.

అంకితభావంతో పనిచేయండి

● కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ జీఆర్ రాధిక, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాలతో కలిసి ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎన్నికల విధులు ఉన్నాయని, అందరూ చురుగ్గా పని చేయాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని చెప్పారు. శాఖా పరమైన విధులతో పాటు రానున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సంసిద్ధతతో ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎన్నికలు జరగనున్న సందర్భంగా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, డీపీఓ రవి కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరుకు సాగులో డ్రోన్ల వినియోగం



కిల్లాం వద్ద డ్రోనులో పోషక పదార్థాల నీటిని నింపుతున్న తీరును పరిశీలిస్తున్న నేతాజీ

నరసన్నపేట: చెరుకు సాగులో సమగ్ర వ్యవసాయ పద్ధతులతో పాటు పరికరాల వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ అన్నారు. కిల్లాం పరిసర గ్రామాల్లో చెరుకులో సస్యరక్షణ చర్యలను శనివారం డ్రోన్ సహాయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిల్లాంతో పాటు కొల్లివలస తదితర గ్రామాల్లో భూ సార పరీక్షల ఆధారంగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు అనుసరించి యాభై ఎకరాల్లో సూక్ష్మ పోషకాలను డ్రోన్లు ద్వారా పిచికారీ చేసినట్లు తెలిపారు. ఈఐడీ ప్యారీ సంస్థ సహకారంతో సస్య రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ఈ పద్ధతులకు అలవాటు పడాలన్నారు.

దవాఖానాలు

ఒక ఆస్పత్రి పాతిక గ్రామాల దశాబ్దాల కలకు ప్రతిరూపం. మరో ఆస్పత్రి పాతిక వేల మంది ప్రజల ఆశల రూపం. హామీ ఇచ్చి గద్దెనెక్కిన వారు మాటలు తప్ప పనులు చేయలేకపోయారు. ఓట్లు వేయించుకుని అక్కడ అధికారం పీఠం దక్కించుకున్న టీడీపీ నేతలు నిధులు తెప్పించలేకపోయారు. ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ గ్రామాల రోదన వింది. వారి యాతనను గుర్తించింది. ఆగమేఘాల మీద రెండు ఊళ్లలో పీహెచ్‌సీల నిర్మాణం పూర్తి చేసి చూపించింది. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, సోంపేట మండలంలోని మాణిక్యపురంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న పీహెచ్‌సీలను నేడు ప్రారంభించనున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్/కవిటి



- ఈదుపురం, మాణిక్యపురం పీహెచ్‌సీల ప్రారంభోత్సవం నేడు
- దశాబ్దాలుగా పట్టించుకోని టీడీపీ నాయకులు
- పనులు పూర్తి చేసి చూపించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఈదుపురం పీహెచ్‌సీ

ఈదుపురంలో..

మత్స్యకార గ్రామాలతో పాటు సుమారు పాతిక గ్రామాల ప్రజలు ఈదుపురం పీహెచ్‌సీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులు ఈదుపురం ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికినా పనులు చేయలేకపోయారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నప్పుడు పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్ చొరవతో 2021 జూలై 9న ధర్మాన కృష్ణదాసు చేతులమీదుగా ఈదుపురంలో నాబార్డ్ నిధులు రూ.1.85 కోట్లతో ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు పనులన్నీ పూర్తయ్యి ఆదివారం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

చాలా సంతోషంగా ఉంది



మా గ్రామంలో ఆస్పత్రి కడతామని పదేళ్లుగా ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మభ్యపెట్టారు. కనీసం ఒక్క ఇటుక ముక్క కూడా వేయలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, నర్తు నరేంద్రలు సంయుక్తంగా ఈ ఆస్పత్రి వచ్చేందుకు ఎంతగానో కృషి చేశారు. ఈ రోజు ఆస్పత్రి ప్రారంభం అవుతుందంటే అది సీఎం వైఎస్ జగన్ ఘనతే.

– ఉప్పాడ నారాయణమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు, ఇచ్ఛాపురం మండలం

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



ప్రభుత్వం ఇటీవల వైద్యశాలల బలోపేతానికి పెద్ద పీట వేయడం గొప్ప పరిణామం. మా టైమ్‌లో ఇక్కడ కొత్త భవనంలో మాణిక్యపురం పీహెచ్‌సీ సేవలు అందించే అవకాశం దక్కింది. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం.

– డాక్టర్ భాస్కర్, మెడికల్ ఆఫీసర్, మాణిక్యపురం, కవిటి మండలం

అడ్డంకులు దాటుకుని..

మాణిక్యపురం పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయ్యింది. కవిటి, సోంపేట మండలాలకు చెందిన పది సచివాలయాల ప్రజలకు ఇది ఆధారం. నాలుగేళ్ల కిందట వైఎస్సార్ సీపీ మాజీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చొరవతో రూ.1.75 కోట్లతో ఆస్పత్రి పనులు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ సీపీ నేత దేవరాజు సాహు పర్యవేక్షణలో పనులన్నీ పూర్తి చేశారు. దీంతో దాదాపు పాతికవేల మంది ప్రజలకు ఇప్పుడు సులభంగా సేవలు అందనున్నాయి. పది పంచాయతీలకు చెందిన 32హేబిటేషన్ గ్రామాలకు చెందిన 7సబ్ సెంటర్లను ఈ కేంద్రానికి అనుసంధానం చేశారు. ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లు 13 మంది ఆస్పత్రి సిబ్బందితో నాణ్యమైన సేవలు అందనున్నాయి. టీడీపీ నాయకులు దీనిపై హామీలు ఇవ్వడం తప్ప పనులు చేయలేకపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకనే పనులు జరిగాయి.

సీఎం దార్శనికత భేష్



సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు నిదర్శనం మాణిక్యపురం పీహెచ్‌సీ నిర్మాణం. పల్లెలకు అత్యంత దగ్గరలో నాణ్యమైన సేవలతో కూడిన వైద్యం అందించాలని ఆయన తపించారు. అందుకు తగ్గట్టుగానే పనులు కూడా చేయించారు.

– పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం



కవిటి: టీడీపీ పాలనలో మాణిక్యపురం పీహెచ్‌సీ భవనం దుస్థితి



కవిటి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మాణిక్యపురం పీహెచ్‌సీ భవనం

ఎందుకీ దురహంకారం..?





- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌పై అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు
- హిందీ, ఇంగ్లిష్ రానోడు అంటూ దిగజారుడు వ్యాఖ్యలు
- అచ్చెన్న వ్యాఖ్యలపై మండిపడుతున్న కాళింగ సామాజికవర్గం, ఇతర నాయకులు, మేధావులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'ఢిల్లీ సెంటర్‌లో దించి నువ్వు ఎక్కడికైనా వెళ్లు అంటే దారి తెలియనటువంటి వ్యక్తి. ఇంగ్లిష్, హిందీ రాని వ్యక్తికి పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చారు. అటువంటి వ్యక్తి కింజరాపు రామ్మోహన్ నాయుడిపై పోటీ అట. ఆయనతో పోటీ చేయాలంటే ఎవరైనా భయపడతారు' శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త పేరాడ తిలక్‌పై ఇటీవల టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలివి.

అచ్చెన్న దురహంకారానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనాలు. పట్టభద్రుడైన పేరాడ తిలక్‌ను పట్టుకుని హేళనగా, చులకనగా మాట్లాడటంపై జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు మండి పడుతున్నారు. అచ్చెన్నాయుడు దొరల అహంకారాన్ని చూపిస్తూ అవతలి వ్యక్తులను చిన్నతనంగా, అనాగరికంగా మాట్లాడుతున్నారని దుయ్యబడుతున్నారు. కాళింగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని అవమాన పరిచేలా అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం జిల్లా అంతటా చర్చ జరుగుతోంది.

అచ్చెన్నా.. ఇది తగునా..!

ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పిల్లల కోసం ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెడితే కోర్టులకెళ్లి అడుగడుగునా అచ్చెన్న అడ్డు తగిలారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు ఎందుకు, ఇంగ్లిష్ నేర్చుకుంటే ఏమొస్తుంది, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియమేంటి, పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోకూడదు, పైస్థాయికి వెళ్లకూడదన్నట్టుగా అచ్చెన్న వ్యవహరించారు. ఇప్పుడదే నోటితో ఇంగ్లిష్ రాని వ్యక్తికి పార్లమెంట్ టిక్కెటా.. అని అనడం అచ్చెన్న దిగజారుడు రాజకీయాన్ని సూచిస్తోంది.

'చదువుకున్న వ్యక్తికి ఇంగ్లిష్ పెద్ద కష్టమేమి కాదు. అలాగైతే మీ సోదరుడు, దివంగత నాయకుడు కింజరాపు ఎర్రంనాయుడుకు ఎంపీగా వెళ్లినప్పుడు ఆయనకు వచ్చా? ఆ తర్వాత నేర్చుకున్నదే కదా?' అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కాళింగ సామాజిక వర్గ మేధావులు అచ్చెన్నను సూటిగా ప్రశ్నిస్తున్నారు.

పెరుగుతున్న ఆగ్రహజ్వాల..

ఇప్పటికే మండలాల వారీగా అచ్చెన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిలక్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ క్షమాపణ చెప్పాలని కోరుతున్నారు. రాజకీయాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్న పేరాడ తిలక్‌ను అడ్డుకోవాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరిస్తున్నారు. రాజకీయంగా ఎదుగుతున్న తమ నాయకుడిపై అవాకులు చవాకులు మాట్లాడితే బుద్ధి చెబుతామని ప్రెస్‌మీట్లు పెట్టి అచ్చెన్నను హెచ్చరిస్తున్నారు.

రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు..



మాకు ఎవరూ సాటి రారు అనే అహంకారంతో అచ్చెన్నాయుడు మాట్లాడారు. ప్రభుత్వ స్కూల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని గొడవ పెట్టిన నువ్వు ఇంగ్లిష్ రాదని మా పార్లమెంట్ సమన్వయకర్త గురించి మాట్లాడుతావా. ప్రభుత్వ స్కూల్లో చదువుకున్న వారు రాజకీయాలకు పనికిరారా...అచ్చెన్నాయుడికి పోయే కాలం ఎక్కువైంది. ఇలాంటి దౌర్భాగ్యులకు రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు.

– సీదిరి అప్పలరాజు, రాష్ట్ర మత్స్య శాఖామంత్రి.

బహిరంగ చర్చకు సిద్ధమా...



ఎంపీగా పోటీ చేయాలంటే ఇంగ్లిష్, హిందీ భాషలు తెలిసి ఉండాలంటూ తెలుగు భాష సక్రమంగా రాని అచ్చెన్నాయుడు ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎద్దేవా చేశారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళం భాషల్లో ఏ చర్చకైనా సిద్ధంగా ఉన్నాను.

–దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

ఓటమి తప్పదు..



అచ్చెన్నాయుడు ముందు తమ పార్టీ పరిస్థితి చూసుకోవాలి. రాష్ట్రమంతటా అభ్యర్థులను ప్రకటించి అప్పుడు మాట్లాడాలి. టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌ల చేతిలో నువ్వు, నీ అన్నకొడుకు ఓడిపోవడం ఖాయం.

–ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే

సైన్స్ ఉపాధ్యాయునికి అభినందనలు

ఆమదాలవలస: విజయవాడలో ఇటీవల జరిగిన సదరన్ సైన్స్ ఫెయిర్‌లో టీచర్స్ కేటగిరీలో స్పెషల్ ప్రైజ్‌కు చింతాడ మున్సిపల్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి.గౌరీశ్వర రావు తయారు చేసిన లైఫ్ సేఫ్టీ స్టిక్ ఫర్ ఫార్మర్స్ ప్రాజెక్ట్ ఎంపికైంది. ఈ అవార్డ్‌ను స్కూల్ డైరెక్టర్ ప్రతాప రెడ్డి చేతులమీదుగా ఆయన అక్కడ అందుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈఓ వెంకటేశ్వరరావు ఆయనను అభినందించారు. దీనికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయునికి కూడా అభినందనలు తెలిపారు.



చింతాడ మున్సిపల్ హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



ఆమదాలవలస రూరల్: మండలంలో కలివరం గ్రామ సచివాలయం పరిధిలో గల వలంటీర్ గండుబిల్లి రాజశేఖర్ హైదరాబాద్‌లో ఉంటున్న వృద్ధురాలు పన్నీరు సరస్వతికి శనివారం పింఛన్ అందజేశాడు. సరస్వతికి అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో గల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిత్యం ఆస్పత్రికి వెళ్లాల్సి రావడంతో హైదరాబాద్‌లో కుటుంబ సభ్యుల ఇంట్లో ఉంటున్నారు. ఫిబ్రవరి నెలలో పింఛన్ తీసుకోవడానికి రాలేకపోవడంతో గ్రామ వలంటీర్ స్పందించి అక్కడకు వెళ్లి వితంతు పింఛన్ అందజేశారు.

● ప్రజానంద గీతిక

నిలబెట్టుకున్న హామీకి కృతజ్ఞతగా, చేసిన మంచికి సాక్ష్యంగా, పొందిన ప్రజా బలానికి నిదర్శనంగా జిల్లాలో సంక్షేమ సంబరాలు కొనసాగుతున్నాయి. నాలుగు విడతల ఆసరా సాయం అందుకున్న అతివలు గుండెను గొంతుగా చేసుకుని జగన్నినాదాన్ని పలుకుతున్నారు. 'చెప్పాడంటే.. చేస్తాడంతే' అంటూ సీఎం వైఎస్ జగన్‌ను మనసారా ఆశీర్వదిస్తున్నారు.



పోలాకి : గుప్పెడుపేటలో నిర్వహించిన ఆసరా సంబరాలకు హాజరైన డ్వాక్రా మహిళలు



సారవకోట: బుడితిలో ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు



టెక్కలిలో ఆసరా సంబరాల్లో ర్యాలీ చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి తదితరులు



హిరమండలం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

క్లుప్తంగా

మంత్రిని కలిసిన కలెక్టర్, నగర కమిషనర్



మంత్రిని కలిసిన కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం రూరల్: రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో తలపెట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు, ప్రాక్టికల్స్ జరగనున్న నేపథ్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి జరుగుతాయని, ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఇన్విజిలేటర్లు 1600 మంది, సీసీ కెమెరాలు 1480 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 85 పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయని వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని చెప్పారు. విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద అదనంగా పోలీసు బందోబస్తు అవసరమైతే తెలియజేయాలన్నారు. డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆర్ఐఓ దుర్గారావు ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్, పరీక్షల ఏర్పాట్లు, తదితర వాటి గురించి వివరించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు



తలకు గాయమై పడి ఉన్న పవన్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న పాతబ్రిడ్జి వద్ద శనివారం ఓ యువకుడు బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ చెప్పిన వివరాల మేరకు.. కలెక్టర్ బంగ్లా సమీపంలోని రాధాకృష్ణ నగర్‌లో వనుము అచ్చప్పడు తన భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెతో కలిసి జీవిస్తున్నాడు. అచ్చప్పడు చిన్నకుమారుడు పవన్‌కుమార్ (30) నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. శనివారం నాగావళి నది పాత బ్రిడ్జి మీదుగా తన స్కూటీతో ఇంటికి వస్తుండగా బండి స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. దీంతో స్థానికులు ఆయనను 108లో రిమ్స్‌కు తరలించారు. ఆయన తండ్రి అచ్చప్పడుకు సమాచారం అందజేశారు. పవన్ అపస్మారక స్థితిలో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సరిహద్దులో గేటు ఏర్పాటు



పాతపట్నం అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గేటు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర సరిహద్దు పాతపట్నం చెక్‌పోస్ట్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ ఎస్.సాయి తెలిపారు. శనివారం పాతపట్నం ఆర్టీసీ సమీపంలోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గేటు ఏర్పాటు చేశారు. ఒడిశా, ఆంధ్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి ఆభరణాలు, అనధికార మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయనున్నారు.



పోస్టర్ యుద్ధం

- టెక్కలిలో చెలరేగిపోతున్న అచ్చెన్న అనుచరుడు
- లాడి శ్రీను అనే నాయకుడిపై సొంత పార్టీ నాయకుల ధ్వజం
- పోస్టర్లు అతికించి మరీ నిరసన వ్యక్తం చేస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'లాడి శ్రీను బారి నుంచి మమ్మల్ని కాపాడండి'.. టెక్కలిలో వైరల్ అవుతున్న నినాదమిది. ఎక్కడికక్కడ పోస్టర్లు అతికించి మరీ అతడి ఆగడాలను ప్రచారం చేస్తున్నారు. అందులోనూ సొంత పార్టీ నాయకులే అతడి దౌర్జన్యాలను తట్టుకోలేక ఎదురు తిరుగుతున్నారు. లాడి శ్రీను అనే టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు అనుచరుడు. అచ్చెన్న అండ చూసుకుని నియోజకవర్గంలో దందా నడిపిన వ్యక్తి. ఇతగాడి తీరుతో విసిగిపోయిన టీడీపీ నాయకులు ఏకంగా పోస్టర్లు ముద్రించి గోడలపై అతికిస్తున్నారు.

ఆరోపణల వెల్లువ..

- ఒకప్పుడు పట్టణంలో గల ఓ సిల్వర్ ఫ్యాక్టరీలో మేనేజర్‌గా పనిచేసిన లాడి శ్రీను ఇప్పుడు కోట్లాది రూపాయలకు అధిపతిగా మారాడు. టెక్కలి టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఈయన రియల్ ఎస్టేట్, సాధారణ భూముల తగాదాల్లో కలుగజేసుకుని అచ్చెన్నాయుడు పేరు చెబుతూ దందాలు కొనసాగిస్తుంటాడన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి.
- అంతే కాకుండా వైశ్య సామాజిక వర్గంలో భార్య భర్తల తగాదాలు, కుటుంబ ఆస్తుల వ్యవహారాల్లోకి చొరబడి వారి నుంచి కొంత లాగేస్తారన్న విమర్శలు ఉన్నాయి.



టెక్కలి నియోజకవర్గంలో లాడి శ్రీనుపై గోడపై అతికించిన పోస్టర్

- ఈయన చేసిన భూదందాల వల్ల గతంలో టెక్కలిలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అచ్చెన్నాయుడు రవాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు టెక్కలిలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను షాపింగ్ మాల్ పేరుతో అడ్డదారిలో టెండర్లు కొట్టేసి, అచ్చెన్నాయుడికి బినామీగా వ్యవహారాలు నడిపారన్న వాదనలు ఉన్నాయి.
- నరసన్నపేటలో మినుముల కుంభకోణంలో ఈయన పాత్ర ఉందని అప్పట్లో చర్చ జరిగింది.
- సిల్వర్ ఫ్యాక్టరీ నిర్వహణలో కూడా అడ్డగోలుగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నరసన్నపేటలో లాడి శ్రీను బంధువులకు చెందిన ఓ వ్యవహారంలో సమీప బంధువు లాడి శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- చివరకు ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సక్రమంగా లేదనే ప్రచారం చేస్తూ పిచ్చివాడిగా మార్చేశారు. అంతే కాకుండా అదే వ్యక్తి విశాఖపట్టణంలో అనుమానాస్పదంగా మృతి చెందారు.
- ఇలాంటి చరిత్ర ఉన్న లాడి శ్రీను ప్రస్తుతం టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నకు ప్రధాన అనుచరుడిగా చెలామణి అవుతూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఈయన తీరును గత కొంతకాలంగా సొంత పార్టీ నాయకులే వ్యతిరేకిస్తున్నారు. ఆ మధ్య రచ్చకెక్కిన పరిస్థితి చోటు చేసుకుంది.

సొంత పార్టీ నేతలు కూడా లాడి జులుం తట్టుకోలేక టెక్కలిలో రాత్రికి రాత్రి గోడలపై ఆయనకు వ్యతిరేకంగా పోస్టర్లు అతికించారు. లాడి శ్రీను బారి నుండి మమ్మల్ని కాపాడండి అని పేర్కొంటూనే కింజరాపు కుటుంబానికి అవినీతి మరకలు అంటించిన ద్రోహి లాడి శ్రీను అని అదే పోస్టర్లలో ముగింపు ఇచ్చారు. ఇప్పుడీ పోస్టర్లలో టెక్కలి టీడీపీలో చర్చనీయాంశంగా మారాయి. మరి అచ్చెన్నాయుడు వంత పాడుతారో...లేదంటే పక్కన పెట్టి తనకు సంబంధం లేదని తప్పుకుంటారో చూడాలి.

భోజనం పెడతామని టీడీపీ కండువాలు కప్పారు



మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పరిస్థితిని వివరిస్తున్న గిరిజనులు

- టీడీపీ నాయకులపై ధ్వజమెత్తిన గిరిజనులు

మందస: గిరిజనులకు భోజనాలు పెడుతున్నామని పిలిచి తెలుగుదేశం పార్టీ కండువాలను కప్పేశారని మందస మండలంలోని చీపి పంచాయతీ గిరిజనులు ఆరోపించారు. వారు శనివారం మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి పరిస్థితిని వివరించారు. ఇటీవల చీపి పంచాయతీలో టీడీపీ నాయకురాలు శిరీష పర్యటించారని, భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తమను పిలిచారని, తీరా అక్కడకు వెళ్లాక తామంతా టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇలా చేయడం సిగ్గుచేటన్నారు. 60 ఏళ్లలో గౌతు కుటుంబానికి సాధ్యం కాని అభివృద్ధి ఐదేళ్లలో అప్పలరాజు చేసి చూపించారని ప్రశంసించారు. అభివృద్ధికే గిరిజనులు ఓట్లు వేస్తారని, తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఉంటామన్నారు. అనంతరం సీదిరి అప్పలరాజు వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతాడ గణపతి, మాజీ ఎంపీపీ సవర కామేసు, గిరిజన నాయకులు సవర రాము, చిరంజీవులు, సవర కూర్మారావు, కర్రి గోపాలకృష్ణ, బొందకరి, దాలసరి, కొండమేర, చీపి గ్రామాల నుంచి గిరిజనులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వంశధార ప్రాజెక్టుతో 2.5 లక్షల ఎకరాలు సస్యశ్యామలం

- వంశధార ప్రాజెక్టుకు బొడ్డేపల్లి రాజగోపాలరావు నామకరణం వైఎస్సార్ చలవే
- బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణలో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇంజినీర్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోని వంశధార ప్రాజెక్టుతో 2.5 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నేరడికి ఒడిశా అడ్డంకి ఉండడంతో గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి 19 టీఎంసీల నీటితో రిజర్వాయర్ నింపి ఈ ఖరీఫ్ నాటికి జిల్లాలో 2.5లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చకచకా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక వంశధార ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు రాజశేఖర రెడ్డి హయాంలో బొడ్డేపల్లి పేరు పెట్టినట్లు గుర్తు చేశారు. ఎత్తిపోతల పథకానికి సీఎం వైఎస్ జగన్ నిధులు మంజూరు చేయడంతో జిల్లా ప్రజలంతా రుణపడి ఉంటారని అన్నారు. రెండు నెలలు పూర్తిగా వర్షాలు కురవకపోయినా ఇంజినీర్లు చక్కగా వ్యవహరించి శివారు ఆయకట్టు వరకు నీరందించారని అభినందించారు.

వంశధార-బహుదా అనుసంధానం 2019 ఎన్నికల సమయంలో టీడీపీ నేతల కమీషన్ల ప్రాజెక్టుగా రూ.6వేలు కోట్లతో రూపకల్పన చేశారని, దాని వల్ల ఎవ్వరికి ఉపయోగం లేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద ఆందోళన చెందాల్సిన పని లేదని న్యాయవాదులు, ప్రజలు, నిపుణుల ఆమోదం మేరకే అమలుచేస్తామన్నారు. ఈ చట్టం అమలు కావాలంటే సర్వే పూర్తిగా జరగాలన్నారు. 17వేల రెవెన్యూ విలేజ్‌లకు గాను 4 వేల విలేజ్‌లలో సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. సర్వే నంబర్ ప్రకారం మ్యాప్స్‌తో సహా గుర్తించిన తర్వాత ఈ చట్టం అమలు చేస్తామని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై న్యాయవాదుల అభిప్రాయాలను గౌరవిస్తున్నామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 71.31లక్షలకుపైగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, 12 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్లు ఇచ్చామని, పట్టాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీనికి ఏ ఒక్కరూ నయాపైసా చెల్లించాల్సిన పనిలేదన్నారు. పట్టాను, ఆధార్ కార్డును తీసుకుని రెవెన్యూ సెక్రటరీని, ఇంకా ఇతర రెవెన్యూ అధికారులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.

ఎమ్మార్వో హత్య కేసులో విశాఖ పోలీస్ కమిషనర్‌కి డైరెక్షన్ ఇచ్చామని, మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దోషులను పట్టుకుని శిక్షించేందుకు ప్రభుత్వం కఠినంగా ఉందన్నారు. కార్యక్రమంలో వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, డీఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈలు ఎం.వి రమణ, సీతారాంనాయుడు, రామచంద్రరావు, త్రినాథరావు, ప్రదీప్‌కుమార్, శ్రీకాంత్, మన్మధరావులతో పాటు డీఈలు,జేఈ, ఏఈలు పాల్గొన్నారు.

'రథసప్తమి వైభవంగా నిర్వహించాలి'



రథసప్తమి ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, పక్కనే పాలకమండలి సభ్యులు

అరసవల్లి: రథసప్తమి మహోత్సవాన్ని ఈ నెల 16న అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి క్షేత్రంలో ఘనంగా నిర్వహించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. ఈమేరకు రథసప్తమి ఉత్సవ కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి ఆయన శనివారం ఉదయం ఆవిష్కరించారు. ఆయన ముందుగా స్వామిని దర్శించుకుని రథ సప్తమి ఏర్పాట్లపై ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదన్నారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేస్తానన్నారు. దాతలకు, వీఐపీలకు కూడా పక్కాగా దర్శన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, ఎస్.కోటేశ్వర చౌదరి, దుక్క గనిరాజు, ఎల్.గోవిందరావు, జె.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి గంగు సీతాపతి, పార్టీ నేతలు ద్వారపు అజిత్‌కుమార్ తదితరులున్నారు.

'అక్రమ నియామకాలపై కమిటీ వేయాలి'



డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫోన్ కాల్స్ చేశారు. ప్రధానంగా ప్రజా సంఘాలకు చెందిన వ్యక్తులు గత వైస్‌చాన్స్‌లర్ రిలీవ్‌కు ముందు భర్తీ చేసిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని ఆరోపించారు. ఈ ఉద్యోగాలపై విచారణకు కమిటీ వేయాలని కోరారు. విశ్వ విద్యాలయంలో అంబేడ్కర్ చైర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర వర్సిటీ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ఖర్చులు బకాయిలు ఉన్నాయని, సకాలంలో చెల్లించాలని అంతర వర్సిటీ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు విన్నవించారు. డిగ్రీ ఇయర్ ఎండ్‌కు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని విద్యార్థులు కోరారు. పీజీ, డిగ్రీ కళాశాల్లో క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల జాప్యంపై ప్రశించారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నిర్వహించిన ఫోన్ ఇన్‌లైవ్‌కు 18 ఫోన్ కాల్స్ వచ్చాయి. ఫోన్ కాల్స్ ద్వారా వచ్చిన వివరాలు వైస్ చాన్స్‌లర్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు.

మగ్గం వర్క్‌తో ఉపాధి

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత మగ్గం వర్క్ 30 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మగ్గం వర్క్ నేర్చుకోవాలనుకున్న వారు వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అయోధ్య-కాశీ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

- 18న శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి బయల్దేరనున్న బస్సు
- పది రోజుల పాటు యాత్ర
- సూపర్‌లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయోధ్య-కాశీ యాత్రకు ప్రత్యేక బస్సు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ అయోధ్య-కాశీ యాత్ర పేరిట వివిధ పుణ్య క్షేత్రాలను 10 రోజుల్లో దర్శించుకునేలా టూర్ ప్లాన్ చేశారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించింది.

అయోధ్య-కాశీ యాత్రకు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి ప్రత్యేక బస్సు నడపనుంది. ఈ యాత్ర 10 రోజులపాటు కొనసాగనుంది. ముందుగా పూరి-జగన్నాథ క్షేత్రం, కోణార్క్- సూర్య దేవాలయం, భువనేశ్వర్ -లింగరాజుదేవాలయం, జాజిపూర్-గిరిజాదేవి శక్తిపీఠం, గయ-మాంగల్య గౌరీ శక్తిపీఠం, శిరోగయ-విష్ణుమూర్తి పాదములు, బుద్ధగయ-బోధి వృక్షం, కాశీక్షేత్రం-విశ్వనాథ జ్యోతిర్లింగ దర్శనం, కాశీ విశాలాక్షి శక్తిపీఠం, కాశీ అన్నపూర్ణ దర్శనం, అన్నపూర్ణాదేవి బంగారుచీర దర్శనం, కాలభైరవుడు, డుండీ గణపతి, బిందు మాధవుడు, తిలబండేశ్వర్, వారాహిమాత ప్రభాత దర్శనం, సంకట విమోచన హనుమాన్, తులసీ మాన మందిరం, దుర్గామాత వ్యాస కాశీ, మణికర్ణిక ఘాట్, మధ్యాహ్నం స్నానం, సీతామడి-సీతాదేవి భూగర్భప్రదేశం, ప్రయాగ(అలహాబాద్)-గంగా, యమున, సరస్వతి నదుల సంగమం, త్రివేణీ సంగమ స్నానం, మాధవేశ్వరీ శక్తి పీఠం, హనుమంతుడి గుడి, అయోధ్య-రామజన్మభూమి, సరయూ నదీ స్నానం, రుద్రావర్తము, లలితాదేవి శక్తిపీఠం, బడేహనుమాన్ మందిరం, దధీచి మహర్షి ఆశ్రమం, నైమిశారణ్యంలో సత్యనారాయణవ్రతం ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

భోజనంతో పాటు..

అయోధ్య-కాశీ సంపూర్ణ యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సు నడపనుంది. మనిషి ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలుగా నిర్ణయించారు. ఈ యాత్రలో 10రోజుల పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌ను ఆర్టీసీయే సమకూరుస్తుంది.

కాశీలో రూమ్ అకామిడేషన్, పడవ ప్రయాణ ఖర్చులు మాత్రం యాత్రికులే భరించుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 7382921647, 7382919694, 7382919696, 9959225608 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

వినియోగించుకోండి



హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరామున్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. అయోధ్య-కాశీ తో పాటు మరికొన్ని పుణ్య క్షేత్రాలను కూడా దర్శించుకోవచ్చు.

– ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ డీపీటీఓ

కానిస్టేబుల్‌కు బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ సమీప హోటల్ యజమానితో గురువారం రాత్రి మద్యం మత్తులో గొడవ పడిన రూరల్ కానిస్టేబుల్‌కు శుక్రవారం రాత్రికి రాత్రే బదిలీ చేశారు.

ఎస్పీ జీఆర్ రాధిక విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక పోలీసు విభాగంతో విచారణ చేయించడంతో పాటు కానిస్టేబుల్ గోపిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శుక్రవారం రాత్రి సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

తహసీల్దార్ రమణయ్యకు అశ్రు నివాళి

- తహసీల్దార్ రమణయ్య హత్యతో జిల్లాలో విషాద ఛాయలు
- స్వగ్రామం దిమిలాడలో అంత్యక్రియలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని రెవెన్యూ సిబ్బంది డిమాండ్



రమణయ్య అంతిమయాత్రలో పాల్గొన్న పేరాడ తిలక్



తహసీల్దార్ రమణయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నందిగాం, నరసన్నపేట, శ్రీకాకుళం పాత బస్టాండ్: విశాఖపట్నం కొమ్మాదిలో శుక్రవారం రాత్రి జరిగిన హత్యలో నందిగాం మండలం దిమిలాడకు చెందిన తహసీల్దారు సనపల రమణయ్య(41) మృతి చెందడంతో జిల్లాలో విషాద ఛాయలు అలముకున్నాయి. దిమిలాడతో పాటు ఆయన భార్య స్వగ్రామం ఉర్లాం కూడా శోకసంద్రంలో మునిగిపోయింది. శనివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామం దిమిలాడలో జరిగాయి.

దిమిలాడకు చెందిన సనపల రంగారావు, శకుంతలమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు రోహిణీరావు ఉపాధ్యాయుడు కాగా చిన్న కుమారుడు రమణయ్య తహసీల్దార్. రమణయ్య 7వ తరగతి చదువుతున్నప్పుడే తండ్రి రంగారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందగా తల్లి ఇద్దరు కుమారులను వ్యవసాయ పనులు చేస్తూ చదివించారు. రమణయ్య 2011 లో గ్రూప్-2కు ఎంపికై డిప్యూటీ తహసీల్దారుగా సరుబుజ్జిలిలో విధుల్లో చేరారు. ఆ తర్వాత అడ్‌హాక్ ప్రమోషన్లలో భాగంగా తహసీల్దారుగా పదోన్నతి పొంది జిల్లాలో వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, లావేరు, విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఏడాగా తర్వాత చిన్నగదిలిలో తహసీల్దారుగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా బంటుపల్లి మండల తహసీల్దారుగా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతలోనే ఆయన హత్య జరిగింది. మృతునికి భార్య అనూష, కుమార్తె సహస్ర(7), కుమారుడు కృష్ణరంగ(3) ఉన్నారు.

శనివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి స్వగ్రామానికి రమణయ్య భౌతిక కాయం చేరుకుంది. తల్లి శకుంతలమ్మ కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. భార్య అనూషతో పాటు పిల్లల రోదన చూసి స్థానికులు కూడా కంట తడిపెట్టారు. భారీగా వచ్చిన జనం మధ్య ఆయన అంతిమయాత్ర జరిగింది. సోదరుడు రోహిణీరావు తలకొరివి పెట్టారు. ఈ శవ యాత్రలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, నాయకులు డోల జగన్, అంబోడి విష్ణు,కోత మధుసూదనరావు, పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ, పలు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు సంతాపం..

రమణయ్య హత్య గురించి తెలిసిన వెంటనే నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైసీపీ నాయకులు చింతు రామారావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ హత్యను వీఆర్వోల సంఘం, జిల్లా రెవెన్యూ సర్వీసులు సంఘం ఖండించాయి. తహసీల్దార్ సనపల రమణయ్యపై దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు పేర్కొన్నారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.